మనం
కడప | అన్నమయ్య

## పుల్లంపేటలో రెండో రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లతో రాజకీయ వేడి



4 లో

# కడప జిల్లాలో మళ్లీ సమరం: ఎస్ఈసీ కీలక ఆదేశాలు..

### మైదుకూరు మొత్తం సహా కడప, రాజంపేట వార్డుల్లో రీ-నామినేషన్లు!

మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 22
కడప జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కీలక మలుపు తిప్పింది. గతంలో నెలకొన్న ఉద్రిక్తతలు, శాంతిభద్రతల సమస్యల వల్ల నామినేషన్లు వేయలేకపోయిన అభ్యర్థులకు ఊరట కల్పిస్తూ ఎస్ఈసీ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 23, 24వ తేదీల్లో అర్హులైన అభ్యర్థులు తిరిగి నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చని అధికారులు అధికారికంగా ప్రకటించారు.

**రీ-నామినేషన్లు స్వీకరించే డివిజన్లు, వార్డుల పూర్తి వివరాలు:**

కడప నగర పాలక సంస్థ (మొత్తం 11 డివిజన్లు): డివిజన్ నంబర్లు 6, 11, 13, 15, 16, 17, 24, 31, 34, 52, 55. నగరంలో ప్రతిష్ఠాత్మకమైన ఈ డివిజన్లలో గతంలో విపక్షాలు నామినేషన్లు వేయలేకపోయాయి. తాజా నిర్ణయంతో కార్పొరేషన్ పీఠంపై పట్టు కోసం అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మరోసారి హోరాహోరీ పోరు ఖాయమైంది.

రాజంపేట మున్సిపాలిటీ (మొత్తం 11 వార్డులు): వార్డు నంబర్లు 6, 12, 13, 14, 17, 19, 23, 24, 25, 26, 27. ఈ వార్డుల్లో తిరిగి ప్రక్రియ ప్రారంభం కావడంతో అభ్యర్థుల ఎంపిక, బీ-ఫారాల కేటాయింపుపై పార్టీల ముఖ్య నేతలు దృష్టి సారించారు.

మైదుకూరు మున్సిపాలిటీ (మొత్తం 32 వార్డులు): మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 1 నుంచి 32 వరకు ఉన్న అన్ని వార్డుల్లోనూ కొత్తగా నామినేషన్లు స్వీకరిస్తున్నారు. గతంలో ఇక్కడ జరిగిన పరిణామాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో, ఎన్నికల సంఘం మున్సిపాలిటీ మొత్తానికి తిరిగి అవకాశం కల్పించడం జిల్లా రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది.

**క్షేత్రస్థాయిలో మారిన సమీకరణాలు.. పటిష్ట భద్రత**

గతంలో ఏకగ్రీవాలుగా భావించిన స్థానాల్లో ఇప్పుడు మళ్లీ నామినేషన్లకు వెసులుబాటు రావడంతో క్షేత్రస్థాయిలో రాజకీయ వేడి ఒక్కసారిగా పెరిగింది. రెండు రోజుల గడువు మాత్రమే ఉండటంతో అభ్యర్థులు అఫిడవిట్లు, నో-డ్యూ సర్టిఫికెట్ల సేకరణలో నిమగ్నమయ్యారు.

**గత చేదు అనుభవాలు పునరావృతం కాకుండా పోలీసు యంత్రాంగం గట్టి నిఘా పెట్టింది:**

నామినేషన్ కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు

ఆర్వో కార్యాలయాల వద్ద సీసీ కెమెరాల నిఘా, పూర్తి వీడియో రికార్డింగ్




అభ్యర్థులకు ఎటువంటి బెదిరింపులు, అడ్డంకులు కలగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు

ఈ నిర్ణయంతో కడప జిల్లా స్థానిక పోరు సరికొత్త రంగు పులుముకుంది. గతంలో పోటీకి దూరమైన అభ్యర్థులు బరిలోకి దిగుతుండటంతో ఎన్నికల వాతావరణం మరింత రసవత్తరంగా మారింది.

# జడ్పీటీసీ బరిలో టీడీపీ జోరు.. 76 నామినేషన్లు!

### 39 స్థానాల్లో నామినేషన్ల దాఖలు.. 49తో టీడీపీ టాప్.. వైసీపీ 16, బీజేపీ 3, జనసేన 1




మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 22: కడప జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో కూటమి హవా స్పష్టంగా కనిపించింది. అక్టోబర్ 22న సాయంత్రం 5 గంటల వరకు అందిన అధికారిక గణాంకాల ప్రకారం మొత్తం 39 జడ్పీటీసీ స్థానాలకు 76 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో టీడీపీ అత్యధికంగా 49 నామినేషన్లు దాఖలు చేసి ముందంజలో నిలిచింది. వైఎస్సార్‌సీపీ 16, బీజేపీ 3, జనసేన 1, ఇతరులు 7 నామినేషన్లు దాఖలు చేశారు.

**టీడీపీదే ఆధిపత్యం**

మొత్తం 76 నామినేషన్లలో టీడీపీ వాటా 49 కావడం ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని చాటుతోంది. వైఎస్సార్‌సీపీ 16 నామినేషన్లతో రెండో స్థానంలో ఉండగా.. బీజేపీ 3, జనసేన 1 నామినేషన్ దాఖలు చేశాయి. ఇతరుల నుంచి 7 నామినేషన్లు వచ్చాయి.

**బద్వేలు.. టీడీపీ దూకుడు**

బద్వేలు జడ్పీటీసీ పరిధిలోని 9 స్థానాలకు 20 నామినేషన్లు వచ్చాయి. ఇందులో టీడీపీ 16, వైఎస్సార్‌సీపీ 2, ఇతరులు 2 నామినేషన్లు దాఖలు చేశారు. మైదుకూరులో టీడీపీ నుంచి అత్యధికంగా 4 నామినేషన్లు వచ్చాయి. బి.కోడూరులో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

**జమ్మలమడుగులో 16 నామినేషన్లు**

జమ్మలమడుగు పరిధిలోని 10 స్థానాలకు 16 నామినేషన్లు వచ్చాయి. టీడీపీ 10, వైఎస్సార్‌సీపీ 3, బీజేపీ 3 నామినేషన్లు దాఖలు చేశాయి. ఎర్రగుంట్లలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ చెరో 2 నామినేషన్లు దాఖలు చేయగా.. ప్రొద్దుటూరు, రాజుపాళెంలో ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

**కడపలో 15.. పులివెందులలో 18**

కడప జడ్పీటీసీ పరిధిలోని 8 స్థానాలకు 156 నామినేషన్లు వచ్చాయి. టీడీపీ 9, వైఎస్సార్‌సీపీ 4, ఇతరులు 2 నామినేషన్లు దాఖలు చేశారు.పులివెందుల పరిధిలోని 8 స్థానాలకు 18 నామినేషన్లు రావడం విశేషం. ఇందులో టీడీపీ 11, వైఎస్సార్‌సీపీ 6, ఇతరులు 1 నామినేషన్ దాఖలు చేశారు.

**రాజంపేటలో 7 నామినేషన్లు**

రాజంపేట పరిధిలోని నాలుగు జడ్పీటీసీ స్థానాలకు మొత్తం 7 నామినేషన్లు వచ్చాయి. టీడీపీ 3, వైఎస్సార్‌సీపీ 1, జనసేన 1, ఇతరులు 2 నామినేషన్లు దాఖలు చేశారు. రాజంపేటలో టీడీపీతో పాటు జనసేన నుంచి కూడా నామినేషన్ దాఖలు కావడం రాజకీయంగా ఆసక్తి రేపుతోంది.

**ఆరు స్థానాల్లో నిల్**

కడప జిల్లాలోని బి.కోడూరు, ప్రొద్దుటూరు, రాజుపాళెం, చెన్నూరు, ఖాజీపేట, నందలూరు జడ్పీటీసీ స్థానాల్లో ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

మొత్తంగా చూస్తే.. 39 జడ్పీటీసీ స్థానాలకు 76 నామినేషన్లు రావడంతో పోటీకి రంగం సిద్ధమవుతోంది. 49 నామినేషన్లతో టీడీపీ స్పష్టమైన ఆధిక్యం సాధించగా.. మిగిలిన పార్టీల బలాబలాలు నామినేషన్ల ఉపసంహరణ, తుది బరిలో అభ్యర్థుల సంఖ్యపై ఆధారపడి మారనున్నాయి.

# కడప జడ్పీ కురుక్షేత్రం.. 'ఢీ అంటే ఢీ'!

### ఆది దూకుడు.. పుత్తా పంతం! జడ్పీ పీఠంపై అధికార పార్టీలో ఆధిపత్య పోరు

### రాజేష్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చిన ఆది.. తగ్గేదేలే అంటున్న పుత్తా వర్గం

### జడ్పీటీసీల గెలుపు కంటే ముందే చైర్మన్ కుర్చీపై 'పావులు'.. అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ




మనం ప్రతినిధి, రాజంపేట, అక్టోబర్ 22:
కడప జిల్లా పరిషత్ పీఠం 'జనరల్' కావడంతో జిల్లాలో రాజకీయ వేడి ఒక్కసారిగా భగ్గుమంది. స్థానిక సంస్థల ఎన్నికల సమరం ఇంకా పూర్తిగా ముగియకముందే జడ్పీ చైర్మన్ కుర్చీ కోసం అధికార టీడీపీలో అంతర్గత పోరు తారస్థాయికి చేరింది. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆది నారాయణరెడ్డి తన సోదరుడి కుమారుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి పేరును చైర్మన్ అభ్యర్థిగా బహిరంగంగా ప్రకటించడంతో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈ ప్రకటనకు ప్రతిగా సీనియర్ నేత పుత్తా నరసింహారెడ్డి వర్గం కూడా వెనక్కి తగ్గకుండా పావులు కదుపుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

**ఆది ప్రకటనతో ఒక్కసారిగా హీట్..**

జమ్మలమడుగు జడ్పీటీసీ స్థానం నుంచి డాక్టర్ రాజేష్‌రెడ్డిని బరిలోకి దింపి, అక్కడ విజయం సాధించిన అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలన్నది ఆది వర్గం వ్యూహంగా ప్రచారం జరుగుతోంది. అభ్యర్థి పేరును ముందుగానే ప్రకటించడం ద్వారా చైర్మన్ రేసులో తమ వర్గం ఆధిక్యతను చాటే ప్రయత్నం జరిగిందనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది.

యువత, విద్యావంతుల నాయకత్వం పేరుతో రాజేష్‌రెడ్డిని ముందుకు తీసుకురావడం ద్వారా జిల్లాలో కొత్త రాజకీయ నాయకత్వానికి బాట వేయాలన్న సంకేతాలను ఆది వర్గం ఇస్తోంది. దీంతో జమ్మలమడుగు నుంచి కడప జిల్లా రాజకీయాల వరకు ఈ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది.

**పుత్తా వర్గం కూడా 'తగ్గేదేలే'..**

ఆది ప్రకటనతో మరోవైపు పుత్తా నరసింహారెడ్డి వర్గంలోనూ కదలిక మొదలైనట్లు తెలుస్తోంది. దశాబ్దాల రాజకీయ అనుభవం, పార్టీపై సీనియారిటీ, క్షేత్రస్థాయిలో ఉన్న సంబంధాలు తమకు బలం అని పుత్తా వర్గం భావిస్తున్నట్లు సమాచారం.

జిల్లా పరిషత్ వంటి కీలక పదవిని అనుభవజ్ఞుడైన నేతకు అప్పగించాలన్న వాదనను ఆ వర్గం బలంగా వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. దీంతో ఇది కేవలం చైర్మన్ అభ్యర్థిత్వ పోటీగా కాకుండా జిల్లా టీడీపీలో భవిష్యత్ ఆధిపత్యాన్ని నిర్ణయించే పోరుగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

**జడ్పీటీసీ ఫలితాల కంటే ముందే.. 'చైర్మన్' లెక్కలు!**

జిల్లా పరిషత్ చైర్మన్ ఎన్నికకు అవసరమైన జడ్పీటీసీ బలాబలాలే కీలకం. దీంతో ప్రతి మండలంలో ఎవరి అభ్యర్థి బలంగా ఉన్నారు? ఎవరికి కేడర్ అండగా ఉంది? ఎక్కడ ఏ సామాజిక సమీకరణం పనిచేస్తుంది? అన్న లెక్కలు అప్పుడే మొదలయ్యాయని తెలుస్తోంది. జడ్పీటీసీ స్థానాల గెలుపు కోసం ఒక పోరు.. వాటి వెనుక చైర్మన్ పీఠం కోసం మరో పోరు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో జిల్లాలోని కీలక మండలాలపై ఇరువర్గాల దృష్టి కేంద్రీకృతమైందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**ఒకే పార్టీ.. రెండు వ్యూహాలు!**

ఆది వర్గం ముందస్తు దూకుడుతో రాజేష్‌రెడ్డి పేరును తెరపైకి తీసుకురాగా.. పుత్తా వర్గం మాత్రం సీనియారిటీ, క్షేత్రస్థాయి బలం, పార్టీ పట్ల దీర్ఘకాల అనుబంధాన్ని ఆయుధంగా చేసుకుని ముందుకు సాగుతున్నట్లు ప్రచారం.

దీంతో 'యువ నాయకత్వమా? సీనియర్ నాయకత్వమా?' అనే చర్చ టీడీపీ శ్రేణుల్లో ఊపందుకుంది. ఇరువర్గాలు తమకు అనుకూలంగా జడ్పీటీసీలను సమీకరించుకునేందుకు ప్రయత్నిస్తే ఎన్నికల వేడి మరింత పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

**అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్..**

అయితే స్థానికంగా ఎవరెన్ని ప్రకటనలు చేసినా జడ్పీ చైర్మన్ అభ్యర్థిత్వంపై పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయం కానుంది. ఆది ప్రకటించిన రాజేష్‌రెడ్డి పేరుకు అధిష్ఠానం మద్దతు ఇస్తుందా? లేక సీనియర్ నేతల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మరో నిర్ణయం తీసుకుంటుందా? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

ఇప్పటికే మండలాల వారీగా రాజకీయ లెక్కలు మొదలయ్యాయి. రాబోయే రోజుల్లో మరిన్ని పేర్లు తెరపైకి వచ్చే అవకాశం ఉండటంతో కడప జడ్పీ పీఠం కోసం పోరు మరింత రసవత్తరంగా మారనుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి.

ఆది దూకుడుకు పుత్తా పంతం అడ్డుకట్ట వేస్తుందా?
రాజేష్‌రెడ్డి పేరుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా?
సీనియారిటీకి పట్టం కడతారా.. యువ నాయకత్వానికి జై కొడతారా?
చివరికి జడ్పీ పీఠం ఎవరికి దక్కనుంది?
కడప జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు ప్రతి చూపూ జడ్పీ కుర్చీపైనే!

# పోలీస్‌స్టేషన్ సమీపంలో కూటమి నాయకుల హడావుడి

వెనుదిరిగిన వైసీపీ అభ్యర్థులు

శాంతిభద్రతల దృష్ట్యా పోలీస్‌స్టేషన్ ఆవరణలో వైసిపి అభ్యర్థులు



ముద్దనూరు అక్టోబర్ 22, మనం న్యూస్: ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ రెండో రోజు ముద్దనూరు పట్టణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి వెళ్తుండగా ఈ పరిణామం చోటుచేసుకుంది. వైసీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు నామినేషన్ల కోసం బయలుదేరిన సమయంలో కూటమి నాయకులు ఎదురుగా వచ్చి అడ్డుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో వైసీపీ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలను పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే నిలువరించారు. మరోవైపు పోలీస్‌స్టేషన్ సమీపంలో కూటమి నాయకులు, కార్యకర్తలు కర్రలతో నిలబడి వైసీపీ నాయకులను నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా పోలీసులు జోక్యం చేసుకుని వారిని అక్కడి నుంచి వెనక్కి పంపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండానే వెనుదిరిగారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలతో ముద్దనూరులో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎలాంటి అడ్డంకులు, భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేసుకునేలా ఎన్నికల అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కోరారు.

# రెండవరోజు చిట్వేలిలో జోరుగా 37 నామినేషన్లు



చిట్వేలీ అక్టోబర్ 22 మనం న్యూస్: మండల కేంద్రంలోనీ ఎంపీటీసీ నామినేషన్ల పర్వం రెండో రోజు జోరుగా కొనసాగింది. ఈ మేరకు టిడిపి 14 ,జనసేన 8, వైసీపీ 9, బిజెపి 3, బీసీవై 1, ఇండిపెండెంట్ 2 మొత్తం 37 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో జైభరత్ రెడ్డి తెలియజేశారు. నగిరిపాడు ఎంపీటీసీ స్థానానికి ఎంపీపీ అభ్యర్థి కస్తూరి వరలక్ష్మితో కలిసి మాజీ ఇంచార్జ్ కస్తూరి విశ్వనాథ నాయుడు, రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల చైర్మన్ కేకే చౌదరి, రాష్ట్ర సాంస్కృతి విభాగం అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, ప్రముఖ పారిశ్రామికవేత్త విశ్వేశ్వర నాయుడు లు హాజరయ్యారు. ఎంపీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. ఎస్ఐ వినోద్ కుమార్ , తిరుపతి స్పెషల్ డిపార్ట్మెంట్ పోలీసులు వంద మీటర్ల పరిధిలో ఒకసారిగా గుమ్మడిన జనాన్ని అక్కడ నుండి తరలించారు. చిట్వేలిలో రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ నామినేషన్ల పర్వాన్ని పరిశీలించారు. ఎస్ఐ వినోద్ కుమార్ తన సిబ్బందితో కలిసి పటిష్ట భద్రత మధ్య ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ ఘట్టం రెండో రోజు సాఫీగా ముగిసింది.

# జెడ్పీటీసీ నామినేషన్ల ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



కడప, అక్టోబరు 22 మనం న్యూస్ : జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భద్రతా చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన రెండవ రోజు జెడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ల స్వీకరణ తీరును, అభ్యర్థులకు కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అభ్యర్థులు ఎక్కువసేపు వేచి ఉండకుండా నామినేషన్ పత్రాలను త్వరితగతిన పరిశీలించి, అవసరమైన మార్గదర్శకాలు అందించాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రకాల భద్రతా చర్యలను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణతో పాటు ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలను సజావుగా, పారదర్శకంగా, ప్రశాంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు, ఓటర్లు నిర్భయంగా తమ ఎన్నికల హక్కులను సద్వినియోగం చేసుకునేలా ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట కడప ఆర్డీవో మురళి, కడప డిఎస్పీ భవానీ పాల్గొన్నారు.

# పుల్లంపేటలోరెండో రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్లతో రాజకీయ వేడి..





పుల్లంపేట అక్టోబర్ 22 (మనం న్యూస్)తిరుపతి జిల్లా పుల్లంపేట మండలంలో ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. 21న మొత్తం 18 నామినేషన్లు దాఖలు కాగా, టీడీపీ నుంచి 15, జనసేన నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. 22వ తేదీన పుల్లంపేట ఎంపీటీసీ స్థానానికి బీజేపీ, బిజెపి అభ్యర్థిని నామినేషన్ వేశారు కొత్తపేట టీడీపీ అభ్యర్థి, వత్తలూరు, జాగువారిపల్లి ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఒక్కొక్కరు నామినేషన్లు దాఖలు చేశారు.రెండో రోజు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు సిద్ధమైన నేపథ్యంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. నామినేషన్ కేంద్రం వద్ద తమను అడ్డుకున్నారని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కడప--తిరుపతి జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. దీంతో హైవేపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది.

ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పరస్పర విద్వేషాలకు తావివ్వకుండా సామరస్యపూర్వకంగా నామినేషన్ ప్రక్రియలో పాల్గొనాలని పోలీసులు సూచించారు. రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు మరిన్ని నామినేషన్లు దాఖలు చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

# సీడీఎస్ఎల్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0 ప్రారంభం

## ఇన్వెస్టర్ అవగాహన భవిష్యత్తును తీర్చిదిద్దడానికి విద్యార్థులకు ఆహ్వానం

తిరుపతి అక్టోబర్ 22 మనం న్యూస్ : వరల్డ్ ఇన్వెస్టర్ వీక్ 2026 సందర్భంగా సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ రీఇమేజిన్ ఐడియాథాన్ 2.0ను ఘనంగా ప్రారంభించింది. ఆర్థిక అవగాహన, సైబర్ భద్రతను బలోపేతం చేసే వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిందిగా భారతదేశం అంతటా ఉన్న విద్యార్థులను ఈ వేదిక ఆహ్వానిస్తోంది. డిజిటల్ మారుతున్న ఇన్వెస్టర్లకు తగినట్లుగా సేవలను అందించ డం దీని ప్రధాన ఉద్దేశం. భారతదేశంలో 'సమాజ్ సే ఇన్వెస్టింగ్ సింపుల్' థీమ్‌తో కొనసాగుతున్న ఈ కార్యక్రమం.. సెబీ చేపట్టిన 'ప్రాజెక్ట్ జాగరూక్' ఇన్వెస్టర్ అవగాహన, విద్య లక్ష్యాలకు సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఆర్థిక అక్షరాస్యతను పెంచడానికి, సమాచారంతో కూడిన పెట్టుబడి విధానాలను ప్రోత్సహించడానికి , ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించడానికి సెబీతో పాటు సీడీఎస్ఎల్ వంటి సెక్యూరిటీస్ మార్కెట్ భాగస్వాములు ఇందులో కలిసి పనిచేస్తున్నాయి. అవగాహన ఉన్న ఇన్వెస్టరే శక్తివంతమైన ఇన్వెస్టర్ అనే భావనతో ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. సెబీ ఇన్వెస్టర్ సర్వే 2025 ప్రకారం.. దేశంలోని సుమారు 33.72 కోట్ల కుటుంబాలలో 3.21 కోట్ల కుటుంబాలు (9.5 శాతం) మాత్రమే సెక్యూరిటీస్ మార్కెట్ ఉత్పత్తులలో పెట్టుబడి పెట్టాయి. అయితే 63 శాతం కుటుంబాలకు కనీసం ఒక్క సెక్యూరిటీస్ మార్కెట్ ఉత్పత్తి గురించైనా అవగాహన ఉంది. ఈ అవగాహనకు, భాగస్వామ్యానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. దేశంలో డీమ్యాట్ ఖాతాల సంఖ్య 23 కోట్లు దాటినప్పటికీ, ప్రభుత్వ డేటా ప్రకారం 2025లో సైబర్ మోసాల వల్ల రూ.22,495 కోట్లు నష్టపోయినట్లు వెల్లడైంది. ఇందులో 76 శాతం నష్టాలు నకిలీ పెట్టుబడి , ట్రేడింగ్ స్కామ్‌ల వల్ల జరిగినవే కావడం గమనార్హం.

ఈ సందర్భంగా సీడీఎస్ఎల్ ఎండీ, సీఈఓ నేహాల్ వోరా మాట్లాడుతూ.. ఇన్వెస్టర్లు తమంతట తాముగా సమాచా రాన్ని అంచనా వేసి, సరైన నిర్ణయాలు తీసుకోగలగాలని పేర్కొన్నారు. యువతకు కూడా ఈ అవగాహనను చేరవేయడానికి అమర్ చిత్ర కథతో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, విద్యార్థులలో ఆర్థిక అక్షరాస్యతను పెంచే సెబీ 'మస్ట్'(వీఖూ) కార్యక్రమానికి కూడా ఈ ఐడియాథాన్ తోడ్పాటునందిస్తుంది. పాల్గొనే విద్యార్థులు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, మొబైల్ యాప్‌లు, వెబ్‌సైట్‌లు, చాట్‌బాట్‌లు, గేమ్‌లు, సిమ్యులేషన్‌లు, లెర్నింగ్ మోడ్యూల్స్, అవగాహన ప్రచారాలు లేదా ఏఐ-ఎనేబుల్డ్ అసిస్టెంట్ల రూపంలో తమ ఆలోచనలను సమర్పించవచ్చు. ఆవిష్కరణ, యూజర్ అనుభవం, ప్రభావం, అమలు సాధ్యత, డేటా రక్షణ వంటి అంశాల ఆధారంగా నిపుణుల జ్యూరీ వీటిని పరిశీలిస్తుంది. టీసీఎస్ మాజీ సీఈఓ, కర్మయోగి భారత్ చైర్‌పర్సన్ ఎస్. రామదొరై ఈ జ్యూరీకి అధ్యక్షత వహిస్తారు. అక్టోబర్ 7, 2026 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్ ఐదు టీమ్‌లకు మొత్తం రూ.11.5 లక్షల ప్రైజ్ పూల్ అందజేస్తారు. గతంలో మొదటి రీఇమేజిన్ ఐడియాథాన్‌కు భారీ స్పందన లభించగా, ఇప్పుడు దాని విజయంతో ఈ రెండో విడతను మరింత విస్తృతంగా నిర్వహిస్తున్నారు.

# పెనగలూరులో రెండో రోజు ప్రశాంతంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ

రెండో రోజు 18 నామినేషన్లు దాఖలు - జనసేన - 01, టీడీపీ -15, ఇండిపెండెంట్ - 02 నామినేషన్లు





పెనగలూరు(అక్టోబర్ 22),మనంన్యూస్: పెనగలూరు మండలంలో రెండో రోజు ఎంపిటిసి నామినేషన్లు ప్రక్రియ ప్రశాంతంగ జరిగింది. పెనగలూరు మండలంలో రెండో రోజు 11 ఎంపిటిసి స్థానాలకు గాను 18 నామినేషన్ లు దాఖలు అయ్యాయని ఆర్వో చిన్న రెడ్డయ్య చెప్పారు. రెండు రోజులకు గాను మొత్తం - 35 నామినేషన్‌లు నమోదు అయినట్లు ఆయన తెలిపారు. పెనగలూరు మండలంలో రెండు రోజుల పాటు ఎటువంటి సంఘట నలు జరగకుండా ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నామినేషన్ కేంద్రం పరిధిలో 144 సెక్షన్ ను పక్కాగా అమలు చేసారు. పెనగలూరు -1 ఎంపిటిసికి ఎంజర్ల సాయి కుమార్ రెడ్డి (టీడీపీ), ఎంజర్ల జానికి ( టీడీపీ ), పతకమురి నరేష్ బాబు (టీడీపీ), పెనగలూరు-2 ఎంపిటిసికి శ్యామ రామ్మోహన్ నాయుడు (టీడీపీ), అబ్బీనేని ధనుంజయ నాయుడు (టీడీపీ), అబ్బీనేని గంగి నాయుడు (టీడీపీ), తాటిబోయిన ధనయ్య ( టీడీపీ ), పొందలూరు ఎంపిటిసి కి లేబాక శ్రీనివాసులు రెడ్డి (ఇండిపెండెంట్ ), లేబాక శ్రీనివాసులు రెడ్డి (టీడీపీ), కాకర్ల నాగేశ్వరయ్య (టీడీపీ), నల్లపురెడ్డిపల్లి ఎంపిటిసికి లేబాక స్రవంతి (టీడీపీ)(ఇండిపెండెంట్), పొందలూరు ఎంపీటీసికి లేబాక రెడ్డయ్య (టీడీపీ), కట్టావారిపల్లి ఎంపిటిసికి కట్టా శ్రీలక్ష్మి (టీడీపీ ), కొల్లా సుభద్రమ్మ (టీడీపీ), మన్నూరు భారతి (టీడీపీ), కొండూరు-1 ఎంపిటిసికి మద్దెల రాములమ్మ (జనసేన) నామినేషన్ లు వేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుమని, ఎంపీడివో మోహన్, డిప్యూటీ ఎంపీడివో శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఒంటిమిట్ట అక్టోబర్ 22(మనం న్యూస్): ఒంటిమిట్ట చెరువుకట్టపై వెలసిన కనక దుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి సుబ్బరాజు అమ్మవారిని పలు రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం కుంకుమార్చన, పుష్పాలంకరణ పంచామృత అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.





# ఒంటిమిట్టలో రెండో రోజు 13 నామినేషన్లు

ఒంటిమిట్ట, అక్టోబరు 22 మనం న్యూస్ : జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి రెండో రోజు గురువారం 13 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో తెలుగుదేశం పార్టీ తరఫున 12 మంది నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు నామినేషన్లు వేశారు దీంతో ఇప్పటివరకు మండలంలో దాఖలైన నామినేషన్ల సంఖ్య 14కు చేరింది. మండలంలోని వివిధ ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. పెన్నపేరూరు, గంగపేరూరు, కొత్త మాధవరం స్థానాలకు రెండేసి నామినేషన్లు దాఖలు కాగా, రాచగుడిపల్లి స్థానానికి మూడు నామినేషన్లు

## టీడీపీ నుంచి 12..
## స్వతంత్ర అభ్యర్థి నుంచి ఒకటి

వచ్చాయి. సాలాబాద్ స్థానానికి రెండూ, నర్వకాటపల్లి, మంటపంపల్లి స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలైంది. ఒంటిమిట్ట ఎంపీటీసీ స్థానానికి రెండో రోజు కూడా ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. రాచగుడిపల్లి నుంచి బుజ్జయ్య (కడప), సుంకేసుల చౌదయ్య, మీనిగ వెంకటరమణ నామినేషన్లు దాఖలు చేశారు. గంగపేరూరు నుంచి కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, నందాల వెంకటేశు నామినేషన్లు సమర్పించారు. పెన్నపేరూరు నుంచి అన్నిక భాగ్యమ్మ, అన్నిక రాజేశ్వరి నామినేషన్లు వేశారు. కొత్త మాధవరం నుంచి బోగ గీతాదేవి, ఆలూరి వెంకటసుబ్బయ్య నామినేషన్లు దాఖలు చేశారు. సాలాబాద్ నుంచి అరవ వసంత, అరవ వెంకటసుబ్బమ్మ నామినేషన్లు సమర్పించగా, నర్వకాటపల్లి నుంచి ఒంటిమిట్ట నరసింహులు, మంటపంపల్లి నుంచి షేక్ జాబీనా నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియతో మండలంలోని స్థానిక సంస్థల ఎన్నికల సందడి మరింత పెరిగింది. రానున్న రోజుల్లో మరిన్ని నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# ఎంపీపీ పీఠమే లక్ష్యం.. ప్రజాసేవే ధ్యేయం

## సిద్ధవటం ఎంపీటీసీగా జనసేన అభ్యర్థి అతికారి వినుత నామినేషన్




సిద్దవటం అక్టోబర్ 22 మనం న్యూస్
సిద్దవటం మండల సమగ్రాభివృద్దే పరమావధిగా జనసేన పార్టీ సమరశంఖం పూరించింది. మండల ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా వ్యూహాత్మక అడుగులు వేస్తున్న జనసేన, సిద్దవటం ఎంపీటీసీ అభ్యర్థిగా రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ కుమార్తె అతికారి వినుతను బరిలోకి దింపింది. ఓసీ జనరల్ మహిళకు కేటాయించిన ఈ స్థానానికి ఆమె గురువారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఈ నామినేషన్లను సిద్దవటం జేఏసీ అధ్యక్షుడు బండారు రాజగోపాలయ్య, మాజీ సర్పంచ్ ఓబులయ్య బలపరచగా, నాయకుడు షేక్ మహబూబ్ బాషా (బాబి) సహా పెద్ద ఎత్తున శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తూ.. పార్టీ అండతో ప్రజల సంక్షేమమే ఊపిరిగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ప్రాణవాయువులా నిలిచే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకుంటామని, వారి ఆకాంక్షలకు అనుగుణంగానే ఈ ఎన్నికల పోరు సాగుతుందని స్పష్టం చేశారు. స్థానిక ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, నిస్వార్థ సేవతో మండల సర్వతోముఖాభివృద్ధికి చిత్తశుద్ధితో పాటుపడతామని, ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తామని ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు గట్టి భరోసానిచ్చారు. నామినేషన్ల ప్రక్రియ ఊపందుకోవడంతో సిద్దవటం మండలంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. వినుత నామినేషన్‌తో పాటు మండలంలోని బొగ్గిడివారిపల్లి ఎంపీటీసీ స్థానానికి ఒకటి, మాధవరం-1 ఎంపీటీసీ స్థానానికి మరో నామినేషన్ దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. స్థానిక సంస్థల పోరులో విజయం సాధించి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుండటంతో, జనసేన శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం, రాజకీయ సందడి నెలకొన్నాయి.

# దీపావళికి ఫోన్‌పే భరోసా.. రూ.11 ప్రీమియంతో బీమా.. రూ.25,000 వరకు కవరేజ్!

దీపావళి సందర్భంగా 'ఫైర్‌క్రాకర్ ఇన్సూరెన్స్'ను మళ్లీ ప్రారంభించిన ఫోన్‌పే

కేవలం రూ. 11 నుంచి ప్రారంభమయ్యే ప్రీమియంతో పాలసీ

టపాసుల వల్ల జరిగే ప్రమాదాలకు రూ. 25,000 వరకు వైద్య కవరేజ్

ఆసుపత్రి ఖర్చులు, డే కేర్ చికిత్స, ప్రమాద మరణం వంటివి కవర్

ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్‌తో కలిసి ఈ పాలసీని అందిస్తున్న ఫోన్‌పే




పండుగల సీజన్, ముఖ్యంగా దీపావళి సమీపిస్తున్న వేళ, ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే వినియోగదారులకు భద్రత కల్పించేందుకు ఒక ప్రత్యేకమైన పాలసీని మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. టపాసుల వల్ల జరిగే ప్రమాదాల నుంచి ఆర్థిక రక్షణ కల్పించేందుకు ఉద్దేశించిన 'ఫైర్‌క్రాకర్ ఇన్సూరెన్స్'ను వరుసగా మూడో ఏడాది కూడా అందిస్తున్నట్లు నేడు ప్రకటించింది. కేవలం రూ. 11 వంటి తక్కువ ప్రీమియంతో ప్రారంభమయ్యే ఈ పాలసీ, అనుకోని ప్రమాదం జరిగినప్పుడు రూ. 25,000 వరకు వైద్య కవరేజ్‌ను అందిస్తుంది.
దీపావళి వేడుకల్లో ప్రజలు ఎలాంటి ఆందోళన లేకుండా ఆనందంగా పాల్గొనేందుకు ఈ పాలసీ దోహదపడుతుందని ఫోన్‌పే చెబుతోంది. ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ భాగస్వామ్యంతో ఈ సీజనల్ మైక్రో-ఇన్సూరెన్స్ పాలసీని అందిస్తున్నారు. పండుగ సమయంలో టపాసుల వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు అయ్యే వైద్య ఖర్చుల భారం నుంచి వినియోగదారులకు ఉపశమనం కల్పించడమే దీని ప్రధాన లక్ష్యం. సరళమైన, పారదర్శకమైన నిబంధనలతో ఈ పాలసీని రూపొందించారు.

**పాలసీ కవరేజీ వివరాలు**

ఈ ఇన్సూరెన్స్ పాలసీ కింద మూడు ప్రధాన విభాగాల్లో రక్షణ లభిస్తుంది.
హాస్పిటలైజేషన్ కవర్: టపాసుల ప్రమాదం కారణంగా 24 గంటలకు మించి ఆసుపత్రిలో చేరి చికిత్స పొందాల్సి వస్తే, అయ్యే వైద్య ఖర్చులను రూ. 25,000 వరకు రీయింబర్స్‌మెంట్ రూపంలో పొందవచ్చు.
డే-కేర్ ట్రీట్‌మెంట్: చిన్నపాటి కాలిన గాయాలు లేదా 24 గంటల లోపు పూర్తయ్యే చికిత్సల కోసం అయ్యే వైద్య ఖర్చులను కూడా రూ. 25,000 వరకు క్లెయిమ్ చేసుకునే సౌకర్యం ఉంది.
ప్రమాదవశాత్తు మరణం: దురదృష్టవశాత్తు ప్రమాదంలో పాలసీదారు మరణిస్తే, వారి కుటుంబానికి (నామినీకి) ఏకమొత్తంగా రూ. 25,000 పరిహారం చెల్లిస్తారు. ఈ ప్రయోజనం కేవలం ప్రాథమిక పాలసీదారుకు మాత్రమే వర్తిస్తుంది.

**పాలసీని పొందడం ఎలా?**

వినియోగదారులు తమ ఫోన్‌పే యాప్ నుంచే నిమిషం కంటే తక్కువ సమయంలో ఈ పాలసీని సులభంగా కొనుగోలు చేయవచ్చు.
ముందుగా ఫోన్‌పే యాప్‌లోని 'ఇన్సూరెన్స్' విభాగానికి వెళ్లి, 'ఫైర్‌క్రాకర్ ఇన్సూరెన్స్' ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
అక్కడ కనిపించే ప్లాన్ వివరాలు, అంటే రూ. 25,000 బీమా హామీతో రూ.11 లేదా రూ. 21 వంటి ప్రీమియం ఆప్షన్‌ను ఎంచుకోవాలి.
పాలసీ ప్రయోజనాలు, బీమా సంస్థ వివరాలను పరిశీలించిన తర్వాత, పాలసీదారుడి వివరాలను నమోదు చేయాలి.
చివరగా 'ప్రొసీడ్ టు పే' బటన్‌పై ట్యాప్ చేసి చెల్లింపు పూర్తి చేస్తే, వెంటనే పాలసీ యాక్టివేట్ అవుతుంది.
ఈ సులభమైన ప్రక్రియ ద్వారా, పండుగ వేళల్లో తమ కుటుంబాలకు ఆర్థిక భద్రతను అందించుకోవచ్చని ఫోన్‌పే సూచిస్తోంది.



# టీడీపీకి షాక్.. వైసీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

జగన్ సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న మాజీ ఎమ్మెల్యే

40 ఏళ్ల సేవకు తెలుగుదేశం పార్టీలో అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన

భర్త విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని టీడీపీపై తీవ్ర ఆరోపణలు

ప్రజలకు మంచి చేయాలనే వైసీపీలో చేరానని వెల్లడి

శ్రీకాకుళం మనంన్యూస్: టీడీపీకి శ్రీకాకుళం జిల్లాలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి వైసీపీలో చేరారు. గురువారం తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత జగన్ ఆమెకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. లక్ష్మీదేవితో పాటు ఆమె అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గుండ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా తమ కుటుంబం టీడీపీకి సేవలందించిందని, కానీ చివరకు తీవ్ర అవమానాలే ఎదురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసినా అన్నీ కోల్పోయామని వాపోయారు. తన భర్త, దివంగత నేత, మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ పార్టీలో అవమానాలు ఎదుర్కొన్నారంటూ ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తన భర్త అనారోగ్యంతో ఉన్నప్పుడు కనీసం పరామర్శించేందుకు కూడా టీడీపీ అధినేత రాలేదని ఆమె విమర్శించారు. తన భర్త విగ్రహాన్ని శ్రీకాకుళంలో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తే, స్థానిక టీడీపీ నేతలు అడ్డుకున్నారని, విగ్రహం కోసం నిర్మించిన దిమ్మెలను కూడా ధ్వంసం చేశారని గుండ లక్ష్మీదేవి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ విషయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదని, అందుకే ఎంతో బాధతో పార్టీని వీడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో టికెట్ నిరాకరించినా పార్టీలోనే కొనసాగామని, అయినా తమను దూరం పెట్టారని అన్నారు. ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవిని ఆమె ఆశించగా, పొత్తులో భాగంగా ఆ పదవిని జనసేనకు కేటాయించడంతో పరిణామాలు వేగంగా మారాయి. ఈ నేపథ్యంలోనే మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఇతర వైసీపీ నేతలు ఆమెను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. కూటమి పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని, వారికి మంచి చేయాలనే లక్ష్యంతోనే వైసీపీలో చేరానని లక్ష్మీదేవి తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా నిబద్ధతతో పనిచేశానని, వైసీపీలో కూడా జగన్ నాయకత్వంలో అదే నిబద్ధతతో పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు.

# చంద్రబాబు రాజ్యాంగ వ్యవస్థలను అడ్డుకుంటున్నారు: ధర్మాన

స్థానిక ఎన్నికల వివాదంపై సుప్రీంకోర్టు జోక్యం

రాష్ట్రంలో 100 స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నిలిపివేసిన ఎస్ఈసీ

సుప్రీం ఆదేశాలను స్వాగతించిన వైసీపీ నేత ధర్మాన



శ్రీకాకుళం, మనంన్యూస్: ఆంధ్రప్రదేశ్‌లో 100 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం నిలిపివేసింది. సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలను వైసీపీ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్వాగతించారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ రాజ్యాంగ వ్యవస్థలను స్వతంత్రంగా, సక్రమంగా పనిచేయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. చంద్రబాబు హయాంలో రాజ్యాంగ విరుద్ధమైన విధానాలు కొనసాగుతున్నాయనడానికి సుప్రీంకోర్టు ఆదేశాలే నిదర్శనమన్నారు. ఆయన పాలనలో పోలీస్ వ్యవస్థ, ఎన్నికల సంఘం స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నాయని ఆరోపించారు.

# వైసీపీ నుండి టిడిపిలో చేరికలు

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు మనంన్యూస్: వైసీపీ నుండి టిడిపిలోకి చేరికలు. పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు మండల పరిధిలోని విందూరు పంచాయతీ నుండి వైసిపి నాయకులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి టిడిపి లో జరుగుతున్న అభివృద్ధిని చూసి టిడిపి పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు.

